# మాలతి

సంతోషంతో గంతులేస్తూ, తోటలో వున్న స్నేహితురాలు, "మాలతి" దగ్గరకి చేరాడు చిట్టిబాబు. చల్లగాలి హాయిగా వీస్తోంది. చిట్టిబాబుని మాలతి ఆహ్వానించి, తనప్రక్కనే కూర్చోపెట్టుకుంది. చిట్టిబాబు మాలతిని, తనదగ్గరగా తీసుకున్నాడు. ప్రేమగా నిమిరాడు. మంచిమంచి, కబుర్లు చెప్పాడు. మాలతీ, చిట్టిబాబూ వూగుతూ ఆడుకున్నారు కాస్సేపు.

"మాయింటికిరా, మాలతీ" అన్నాడు చిట్టిబాబు.

"నేనురాను"అన్నట్టు చూసింది. సంతోషంతో వొళ్లుమరచి వుయ్యాలూగింది.

"ఊఁ! నువ్వెప్పుడూ ఇంతే! మాట్లాడవు. నువ్వు మంచిదానివి కావు" కోపంగా అన్నాడు చిట్టిబాబు.

"అలా కోపం తెచ్చుకోకూడదు అన్నట్టుచూసి, తను దాచుకున్న పువ్వులని, చిట్టిబాబు చేతుల్లో పెట్టింది మాలతి.

"ఎంచక్కా వుంటావు, మాంచి దానివి" అన్నాడు చిట్టిబాబు పువ్వులు తీసుకుంటూ. సూర్యుడస్తమిస్తున్నాడు. చిట్టిబాబు లేచాడు ఇంటికి వెళ్లడానికి. వద్దు, వద్దని, అతని కాళ్లని చుట్టేసింది మాలతి.

"అమ్మ కొడుతుంది. రేపు వస్తాగా!" మాలతీని బుజ్జగించి వచ్చేశాడు చిట్టిబాబు. మాలతి వెళ్ళిపోతున్న తన స్నేహితుడ్ని, ఆశగా చూస్తూ అక్కడే షవళించింది బద్ధకంగా.

## సరోజ

మాలతి చిట్టిబాబుల స్నేహలత చిన్నతనంలో నేఅల్లుకుంది. మాలతి చిట్టిబాబుని చూడకున్నా, చిట్టిబాబు తెచ్చే తియ్యటి పానీయాన్ని త్రాగకున్నా వాడిపోతుంది. చిట్టిబాబుకోసం వెయ్యికళ్ళతో వెదుకుతుంది. చిట్టిబాబు పసిహృదయంలో ప్రథమ స్నేహితురాలుగా మాలతి నిలిచింది. మాలతిదగ్గరకి వెళ్ళి ఆడుకోవడమంటే చిట్టిబాబుకి ఎంతో సరదా. మాలతి బాబుకోసం ప్రత్యేకంగా తను దాచుకున్న పువ్వులు తెచ్చి ఇస్తుంది. వాటిని చిట్టిబాబు వాళ్ళ అమ్మకిస్తాడు. 'బావున్నాయిరా' అంటుంది వాళ్ళమ్మ. "మాలతి చాలా బావుంటుందమ్మా, నువ్వు చూడు; వొక్కసారి" అంటాడు చిట్టిబాబు. "వస్తాలేరా" అంటుంది వాళ్లమ్మ. ఇది ప్రతినిత్యం జరుగుతుంటుంది.

చిట్టిబాబు ఇంట్లో అడుగుపెట్టేసరికి, వాళ్ళమ్మ సుశీల "ఎక్కడికెళ్లావురా" అంది కోపంగా.

"మాలతిదగ్గరకమ్మా. ఇవిగో పువ్వులు"చిట్టిబాబు పువ్వులిచ్చాడు.

"ఎక్కడుందిరా ఆ మాలతి?-"

"తోటలోఅమ్మా-"

"తోటలోనా? అయ్యో అక్కడికెళ్లకు బాబూ, అక్కడ బూచులున్నాయిట! భయమేస్తుంది."

"బూచులా? భయమా?- మరి, మాలతికి భయంలేదే? అక్కడే



# ★ మాలతి ★

వుంటుంది నేనెప్పుడు వెళ్లినా. పువ్వు లిస్తుంది, వుండమంటుంది. మాలతి ఎంచక్కా వుంటుందమ్మా!"

"అలాగా, ఒక్కసారి మనింటికి రమ్మనకూడదూ! రేపు తీసుకురా నువ్వు. రోజూ వెళ్ళొద్దు బాబూ అక్కడికి. ఆతోట మంచిది కాదు"

"మాలతి రాదమ్మా, చాలా సిగ్గు. నాతోనే మాట్లాడదు. ప్రతిదీ మూగగా చెబుతుంది. నాకోపం వస్తుంది. ఒకొ్కకసారి ప్రేమగా పట్టి వూపుతుంది. నాకు నవ్వొస్తుంది. పువ్వులిస్తుంది. వుండమని కాళ్లని చుట్టేస్తుంది. పోవద్దని పట్టుకుంటుంది, వెళ్ళకుండా ఎలా వుండనమ్మా"

"అందుకే ఇక్కడికి తీసుకురా అంత మంచిదా ఆ అమ్మాయి."

"అవునమ్మా. వాళ్లమ్మ 'ఎక్కడికీ వెళ్ళొద్దూ; ఇక్కడే వుండు; ఎక్కడికయినా వెళ్లావంటే జబ్బు చేసి చచ్చిపోతావ్' అని చెప్పిందట. అందుకని రాదే!"

"మరీ పువ్వు లెక్కడివి?"

"నేవెళ్ళేసరికి చేతుల్లో పెట్టుకుని వుంటుందమ్మా. నాకిస్తుంది, నావొళ్లో వాలుతుంది" చిట్టిబాబు చెప్పాడు, అబద్ధాలూ నిజాలూ కలిపి. సుశీల నవ్వింది.

"ఎలావుంటుందిటరా, మాలతి?" అంది చిట్టిబాబుకి అన్నం పెడుతూ. చిట్టిబాబు మాలతినిగురించే ఆలోచిస్తూంటాడు.

"అమ్మా, మాలతి మాట్లాడదేమ్మా?"

"సిగ్గన్నావు కదరా!"

"కాదే"

"మూగ పిల్ల లుంటారురా; బహుశా మూగదేమో!"

"ఛా కాదు" మాలతి మూగదన్నందుకు చిట్టిబాబుకి వాళ్ళ అమ్మమీద కోపం వచ్చింది.

వర్షం అప్పుడప్పుడే కురుస్తోంది. మబ్బులు వస్తున్నాయి. చిట్టిబాబుని తోటలోకి వెళ్ళకుండా కాపలా పెట్టింది సుశీల. మాలతిదగ్గరకి వెళ్ళడానికి చిట్టిబాబుకి వీలు దొరకలేదు. రెండురోజులు గడిచాయి. మాలతి తనకోసం ఎదురుచూస్తూంటుంది, వానలో తడుస్తూవుంటుంది పాపం! ఏంచేస్తూందో. చిట్టిబాబుకి ఏడుపొస్తోంది. తను వెళ్ళలేక పోయాడు.

ఆరోజు అమ్మప్రక్కలో చలికి ముడుచుకొని పడుకుని అడిగాడు, "అమ్మా, వర్షంలో తడుస్తూంటే మాలతికి చలెయ్యదూ?" అని.

"అక్కడేదయినా ఇల్లుంటుంది. అందులోకి వెడుతుంది లేరా వర్షం వస్తే"

"లేదమ్మా వెళ్లదు. ఎక్కడికీ వెళ్ళదు"

"నీపిచ్చి లే. పడుకో మాట్లాడక" సుశీల మందలించింది. మరుసటి రోజైనా ఎలా తప్పించుకుని వెళ్లాలా అని ఆలోచిస్తూ నిద్ర పొయ్యాడు.

అలా అలా వారం రోజులకి ఎల్లాగో తప్పించుకుని వెళ్లేడు చిట్టిబాబు. మాలతి ఆహ్వానించ లేదు. పడుకుని వుంది. "మాలతికి కోపం వచ్చిందా నామీద" అనుకుంటూ చిట్టిబాబు వెళ్లి మాలతి ప్రక్కన కూర్చున్నాడు. మాలతి కదల్లేదు; పడుకునే వుంది. "పగలు నిద్రపోతావా? మాలతీ! లే" అంటూ చిట్టిబాబు మాలతిని లేవదీశాడు.

"హూ" అంటూ పడిపోయింది మాలతి. "అయ్యో! ఎవరు కొట్టారు మాలతి నిన్ను? నొప్పిగా వుందా? మందు రాస్తాను, ఏడవకు" మాలతి గాయాలనిచూసి చిట్టిబాబు జాలిగా అన్నాడు. మందు తెచ్చి రాస్తే మాలతికి నొప్పి తగ్గిపోతుంది. కాని ఇంటికొస్తే మళ్ళీ అమ్మ పోనిస్తుందా? మంచిమాటలు చెప్పి హాయిగా నిద్ర పొమ్మని మాలతిని ఓదార్చి బయలుదేరాడు ఇంటికి మందు తెచ్చేందుకు. మళ్ళీ తప్పించుకుని రాలేక పోయాడు. మాలతి బాధల్ని తలచుకుని ఏడుస్తూ నిద్రపోయాడు. నిద్రలో కల వచ్చింది.

కలలో మాలతి చిట్టిబాబుతో "నీకోసం వారంరోజులనుంచీ

సకల దంత వ్యాధులకు
కోతిమార్కు
నల్ల పండ్లపొడి
ప్రతిచోట దొరకును.
నోగి అండ్ కో
87 ప్రైనాబజార్ రోడ్, మద్రాసు-1
బెజవాడ సాకిస్టులు: క్రెట్ ప్రమోటింగు కార్పొరేషన్, పోస్టుబాక్సు నెం. 5 గాంధీనగరం.

ఎన్నో పూలు దాచాను. కాని, ఎవరో వచ్చి నన్నుకొట్టి అన్నీ లాక్కుపోయారు. మళ్ళీ ఆరు నెలలదాకా నాకు పువ్వులు దొరకవు; నీకెలా ఇవ్వను" అంది ఏడుస్తూ.

"ఫరవాలేదులే మాలతీ, నేనున్నాగా, ఈసారివాళ్ళొస్తే గుర్తుగా నాకు చెప్పు. తన్ని పంపిస్తాను" అన్నాడు చిట్టిబాబు. 'సరే' అంది మాలతి, కిలకిలానవ్వుతూ. హాయిగా ఆడుకున్నారిద్దరూ.

నిద్రలేచి చిట్టిబాబు కలని తలచుకుని నవ్వుకున్నాడు. నిజంగా 'మాలతి ఇక పువ్వులివ్వదా, పోనీలే. ఇవ్వకపోతే పోనీ' అనుకున్నాడు. వర్షం జోరుగా కురుస్తోంది. సుశీల, పనివాళ్లూ నిద్రపోతున్నారు. ఇప్పుడే వెళ్లాలి. వర్షం తగ్గితే అమ్మావాళ్లూ లేస్తారు. వర్షంలో పరుగు తీశాడు చిట్టిబాబు. పడ్డాడు. బట్టలు మురికయ్యాయి. లేచి మళ్ళీ పరుగు తీశాడు. తోటలో కెళ్ళేసరికి వాన జల్లులు అధికమయ్యాయి. ఒక్కవుదుటున మాలతిదగ్గరికి పరుగు తీశాడు. మాలతి వర్షంలోతడుస్తూ, చలికి వణికిపోతోంది. చిట్టిబాబు మాలతిని కౌగిలించుకుని కూర్చున్నాడు. వర్షం తగ్గలేదు. తడిసి ముద్దయ్యాడు కాని ఎలా వెళ్ళడం. తల తిరుగుతోంది. వొళ్లంతా నొప్పి. అలాగే వున్నాడు మాలతి ప్రక్కన. ఎవరో గొడుగేసుకుని వస్తున్నారు. ఎవరు ? నాన్న!... చూస్తే చంపేస్తారు. కొట్టారు.

చిట్టిబాబు లేచి సంపెంగ పొద ప్రక్కన దాక్కున్నాడు. గుండెలు అతివేగంగా కొట్టుకుంటున్నాయి. చలి కొరికేస్తోంది.

కాంతారావు (నాన్న) తోటలో కొచ్చి వెదుకుతున్నారు. "చిట్టిబాబూ" అని అరిచారు. నాన్న అటువెళ్లడంచూసి చిట్టిబాబు పరుగు లంకించుకున్నాడు ఇంటికి. సుశీల వచ్చి చిట్టిబాబులాగూ చొక్కా విప్పేసి, తల తుడిచి, చలి కాచి, సేవలు చేసింది. చిట్టిబాబు తలనొప్పికీ, చలికీ అల్లాడిపోతున్నాడు.

తెల్లవారేసరికి చిట్టిబాబువొళ్లు కాలిపోతోంది. సుశీల చిట్టిబాబుని చూసి, "ఎవర్రా ఆమాలతి? ఎందుకెళ్ళావురా?'' అని బాధగా అరుస్తోంది. కాంతారావు డాక్టర్‌ని తీసుకుని వచ్చాడు. మందిచ్చారు. జ్వరం, తగ్గలేదు. "మాలతి తడుస్తోంది. మాలతికి జ్వరం వస్తుంది. తీసుకురండి!'' చిట్టిబాబు పిచ్చిగా కలవరిస్తున్నాడు. "మాలతిని తీసుకొచ్చారా'' చిట్టిబాబు ప్రతీరోజూ జ్వరంలో అడుగుతూనే వున్నాడు. చుట్టుపక్కల మాలతి పేరుగల పిల్లలందర్నీ తీసుకునివచ్చి చూపించారు. 'ఛీ! వీళ్లు కాద'ని మండిపడ్డాడు చిట్టిబాబు. తోటలో ప్రతీరోజూ చూడమనీ ఎవరేనా పిల్ల వస్తే పట్టుకురమ్మనీ, కాంతారావు కాపలా పెట్టాడు. కాని మాలతి అనే పేరుగల పిల్ల ఎవరూ రాలేదు. కాంతారావూ, సుశీలా విసిగిపోయారు. చిట్టిబాబుకి జ్వరం తగ్గుముఖం పట్టింది. నెలరోజులకి చిట్టిబాబు కోలుకున్నాడు. "అమ్మా!- నాన్నా! తోటలోకి వక్కసారి - వక్కసారంటే వొక్కసారే - వెళ్తొస్తానే'' చిట్టిబాబు జాలిగా అడిగేవాడు. తప్పించుకుని వెళ్దామన్నా, కాపలావాడు లోనికి వెళ్ళనివ్వడంలేదు. ఎంతోమంది పిల్లలు ఆటకొస్తారు. కాని చిట్టిబాబు వాళ్ళతో ఆడుకోడు. ఆడుకుంటే మాలతి నున్నని వేళ్ళతో ఆడుకోవాలి. మాలతితో ఆడుకోవాలని చిట్టిబాబు వాంఛ.

మాలతి ఏమయిందో! ఏమో!... మాలతీ!...చిట్టిబాబుకి మాలతి మీద కలవరం ఎక్కువయింది. "ఒక్కసారి ఆడుకుని వస్తానే'' నిద్రలో కలవరిస్తున్న చిట్టిబాబుని చూసి సుశీల, కాంతారావు కంగారుపడ్డారు. మర్నాడు చిట్టిబాబుని తోటలోకి తామే తీసుకెళ్లాలని నిర్ణయించుకొన్నారు. చిట్టిబాబు ఆనందంతో గంతులేశాడు. అమ్మా నాన్నలతో బయలుదేరాడు చిట్టిబాబు స్నేహితురాలు మాలతి దగ్గరికి.

తోటలో కెళ్ళిందే తడవుగా 'మాలతీ' అంటూ ఏడ్వడం మొదలెట్టాడు చిట్టిబాబు. "ఏమిటి ? ఎందుకు?'' అమ్మా నాన్నా అడి




MONEY'S
MODEL LETTER - WRITER &
BUSINESS CORRESPONDENCE
224 Pages Price Rs 1-8-0
Postage As 10
A. S. Money & Co., (AP
14, Sambier Street, Madras-1.

## ★ మాలతి ★

గారు. కాని చిట్టిబాబు ఏడుపు మానలేదు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. "మాలతీ! నిన్నెవరో చంపేశారు. నేను రాకుండా చూసి చంపేశారు." సుశీల కాంతారావు నిర్ఘాంతపోయ్యారు. చిట్టిబాబు పడివున్న దగ్గరనుంచి లేవదీసేసరికి, ఎండి విరిగిపోయివున్న మాలతితీగె కన్పించింది. ఎండిపోయిన తీగెలని పట్టుకుని "కొట్టిచంపారు, గిల్లిచంపారు" అని ఏడుస్తున్నాడు చిట్టిబాబు. సుశీలకీ, కాంతారావుకీ నవ్వూ, ఏడ్పూ వచ్చాయి.

ఒక్క మాలతితీగెకోసమా బాబు ఇంత ఏడుస్తున్నాడు! వాడికి ఈ మాలతేనా ఇంత స్నేహితురాలు. అవ్యాజానురాగమంటే ఇలాంటిదే కాబోలు. ఒక్క పసిహృదయం, నోరులేని చిన్న పూలతీగె ఎంత సన్నిహితులయ్యారు! "నేనే రెండు నెలల క్రితం వీణ్ణి ఈ తోటలోకి తీసుకునివచ్చినప్పుడు 'ఇది మాలతి చెట్టు' అని చెప్పాను" అన్నారు కాంతారావు సుశీలతో. "మాలతి నామాలతిఅంటూ" విరిగిన తీగెలని తీసుకుని ఏడుస్తున్న చిట్టిబాబుని తీసుకుని వెళ్తూ, "మనింట్లో కావలసినన్ని మాలతి మొక్కలు పెడ్దాం బాబూ" అని సముదాయించారు. చిట్టిబాబు పోయిన మాలతికోసం బాధపడని రోజు లేదు.

నా ఫ్రెండ్ చిట్టిబాబువాళ్ళింటికి వెళ్లాను. వాళ్లి కంపౌండు హోలూ గార్డన్ అంతా మాలతి తీగెలమయం గావుంది. "ఏరా, చిట్టిబాబూ, ఇలా మాలతీ తీగలమయం చెయ్యకపోతే వేరే చెట్లు లేవా! అన్నాను."

"అదికాదురా" అని పైకథ వివరించాడు. తన చిన్నతనంలో మాలతి తీగెలన్నా, మాలతి పూలన్నా అంత ఆశ అట. అది మొక్క అని చెప్పక అబద్ధాలు చెప్పి తను వాళ్ల అమ్మానాన్నని ఎలా ఏడిపించాడో చెప్పి నవ్వాడు. ఆనాటికీ, ఈనాటికీ, చిట్టిబాబుకి మాలతి అంటే అమిత ప్రేమ. గంపెడు గిన్నెల్లావుండి తెల్లగా చిన్న చిన్న పూలగుత్తులుగా వుండే మాలతిపూలంటే చిట్టిబాబుకి యింతింత అనలేని ఇష్టం. ఆశ్చర్యమేమిటంటే, వాడి మిసెస్ పేరుకూడా మాలతే. కేవలం ఆ పేరు చూసే ఆమెని "మ్యారేజ్" చేసుకున్నాడా చిట్టిబాబు? ★

